పత్రికా ప్రకటన కాకినాడ, సెప్టెంబర్ 5, 2021

ప్లాస్టిక్ కాదు.. అవి ఫోర్టిఫైడ్ బియ్యం

- జేసీ(రెవెన్యూ) డా. జి.లక్ష్మీశ స్పష్టీకరణ

- అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు అందిస్తున్న

పోషక బియ్యంపై అపోహలు వీడాలని సూచన

గర్భిణులు, బాలింతలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని చిన్నారుల్లో రక్తహీనత, సూక్ష్మ పోషకాల లేమిని నివారించేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కొందరు ప్లాస్టిక్ బియ్యంగా ప్రచారం చేస్తున్నారని, అపోహలు వీడి వాస్తవాన్ని గుర్తించాలని జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లాలో పోషక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్) పంపిణీ, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమాలపై జాయింట్ కలెక్టర్ జి.లక్ష్మీశ వర్చువల్ విధానంలో మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భావితరాల బంగారు భవిష్యత్ లక్ష్యంగా.. ఆరోగ్యకర సమాజాన్ని సాకారం చేసే దిశగా.. తల్లిగర్భం నుంచే సంపూర్ణ ఆరోగ్యానికి పునాది వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రాయోజిత పథకమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ ఈ ఏడాది జూన్‌లో జిల్లాలో ప్రారంభమైందని వివరించారు. సాధారణ బియ్యానికి అదనంగా ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజలవణాలను చేర్చడం ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యం తయారవుతాయని, కిలో ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్ 28-42.5 మిల్లీ గ్రాములు, ఫోలిక్ యాసిడ్ 75-125 మైక్రో గ్రాములు, విటమిన్ (బీ12) 0.75-1.25 మైక్రో గ్రాములు ఉంటాయని వివరించారు. 100 కిలోల సాధారణ బియ్యంలో ఒక కిలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలిపి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాల మేరకు ఉన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వాలంటీర్ వ్యవస్థ, ఇతర మార్గాల ద్వారా ఫోర్టిఫైడ్ పోషక బియ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. పోషక బియ్యంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మీడియా ప్రతినిధులను కోరారు.

<u>**దశల వారీగా సమగ్ర భూసర్వే:-**</u> జిల్లాలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమం కింద పైలట్ ప్రాజెక్టు కింద తొలుత ఆరు గ్రామాల్లోనూ, తర్వాత మరో పది గ్రామాల్లోనూ సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. రోవర్, డ్రోన్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి అంగుళం భూమికి సంబంధించి కచ్చితమైన సర్వే జరుగుతుండటంతో రైతులు ఉత్సాహంతో కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో గ్రామ సర్వేయర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని.. కార్యక్రమంపై నిరంతర సమీక్ష, పర్యవేక్షణ జరుగుతున్నట్లు వెల్లడించారు. సర్వేపై ఇప్పటికే పూర్తిస్థాయి శిక్షణ కార్యక్రమం పూర్తయినందున దశల వారీగా 1685 గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు.

(సమాచార శాఖ జారీ)